పెద్దపల్లి బీఆర్ఎస్ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పక్కన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, పుట్ట మధు, దాసరి మనోహర్ రెడ్డి, మిర్యాల రాజిరెడ్డి తదితరులు

కరీంనగర్ జిల్లా కేంద్రంలో మహాత్మాజ్యోతిబా పూలే విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం పిడికిలి ఎత్తి నినదిస్తున్న ఎమ్మెల్సీ కవిత

కులగణన సర్వే అంతా కాకి లెక్కలే

- జనాభా పెరుగుతుంది కానీ.. తగ్గడమేంటి?
- ఒక కులం పెరిగి.. ఇతర కులాలు తగ్గుతయా?
- సర్వే పత్రాలను ప్రజల పరిశీలనకు పెట్టాలి
- వెంటనే బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించాలి
- ఆ లెక్కల ప్రకారమే స్థానిక ఎన్నికలకు పోవాలి
- కరీంనగర్, పెద్దపల్లి పర్యటనలో ఎమ్మెల్సీ కవిత డిమాండ్

పెద్దపల్లి, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ)/కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించిన బీసీ కుల గణన లెక్కలనైనా పరిగణనలోకి తీసుకొని రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలకు పోవాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. కవిత సోమవారం కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో పర్యటించారు. ఆయా చోట్ల మీడియాతో మాట్లాడారు. జాగృతి ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమాలు, వివిధ బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు చేస్తున్న పోరాటాల ఫలితంగా ప్రభుత్వం బీసీ కుల గణనకు సంబంధించి డాటాను విడుదల చేసిందని చెప్పారు. దేశ చరిత్రలో ఎన్నడూ బీసీ కులగణన దేశవ్యాప్తంగా జరుగలేదని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తాను నియమించిన బీసీ కమిషన్ ద్వారా కాకుండా ప్లానింగ్ కమిషన్ ద్వారా కులగణన సర్వే చేయించిందని చెప్పారు. బీసీ గణన సరిగ్గా జరుగలేదని ఆరోపించారు.

సర్వే లెక్కలు బయట పెట్టాలి

2011 నాటి జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 83 లక్షల ఇండ్లు, రాష్ట్ర జనాభా 3.50 కోట్ల మంది ఉన్నట్టు తెలిపారని కవిత గుర్తుచేశారు. 2014లో రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో 1.03 కోట్ల ఇండ్లు, 3.68 కోట్ల జనాభా ఉన్నట్టు తేలిందని అన్నారు. నాలుగేండ్ల వ్యవధిలోనే రాష్ట్రంలో 20 లక్షల ఇండ్లు పెరిగాయని చెప్పారు. అలాంటిది 2014-2024 వరకు పదేండ్లలో ఎన్ని ఇండ్లు, ఎంత జనాభా పెరగాలో..? ఆలోచించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్న లెక్క ప్రకారం రాష్ట్రంలో 1.15 కోట్ల ఇండ్లు, జనాభా 3.70 కోట్లు ఉందని తెలిపారు. నాలుగేండ్లలో ఏడాదికి 6 లక్షల కుటుంబాల చొప్పున పెరిగితే, పదేండ్లలో కనీసం 60 లక్షల కుటుంబాలు పెరగాలని అంచనా వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2023 వరకు కల్యాణలక్ష్మి చెక్కులే 13.78లక్షల కుటుంబాలకు ఇచ్చామని, ఈ లెక్కన కొత్తగా ఎన్ని కుటుంబాలు పెరిగాయో తెలుస్తున్నదని అన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెప్తున్న లెక్కలు చూస్తే కనీసం 12 లక్షల కుటుంబాలు కూడా పెరిగినట్టు కనిపించడం లేదని అనుమానం వ్యక్తంచేశారు. నేషనల్ హెల్త్ మిషన్ ప్రతి రెండేండ్లకొకసారి చేపట్టే శాంపిల్ లెక్కల ద్వారా తెలంగాణలో 50 నుంచి 52 శాతం బీసీలు ఉన్నట్టు ప్రకటించారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 46.3 శాతం మాత్రమే ఉన్నట్టు లెక్కలు చూపిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే వారు చేసిన బీసీ సర్వే లెక్కలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. వారు చేసిన 3.50 కోట్ల సర్వే పత్రాలను ప్రజల పరిశీలనకు అందుబాటులో పెట్టాలని అన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి, అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లు పాస్ చేసి బాజాప్తా రిజర్వేషన్లు ప్రకటించాలని అన్నారు.

మీ లెక్కల ప్రకారమే 56.3 శాతం ప్రకటించాలి..

జనాభా ప్రకారం రిజర్వేషన్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్తున్నారని, ఆ ప్రకారమే 46.3 శాతం బీసీలు, మరో 10 శాతం ఉన్న ముస్లిం బీసీలను కలుసుకొని మొత్తంగా 56.3 శాతం మందికి రిజర్వేషన్ అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. 'మీ రెంతో..? మీకు అంత' అని అంటూ రాజ్యాంగం పట్టుకొని దేశమంతా తిరిగే రాహుల్‌గాంధీ బీసీల విషయానికి వచ్చే సరికి ఎందుకు వెనక్కి పోతున్నారని నిలదీశారు. ఇదే మోసాన్ని కర్ణాటకలో, బీహార్‌లో చేశారని ఆరోపించారు. తెలంగాణ బీసీలు చైతన్యవంతులని అన్నారు. కాంగ్రెస్ సర్కారు చెప్పిన వన్నీ కాకీ లెక్కలేనని, అయినా సరే ఆ లెక్కల ప్రకారమే బీసీలకు రిజర్వేషన్ ఇచ్చి ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు. ఈ లెక్కల గురించి ఎక్కువగా మాట్లాడితే తమపై నెపం నెట్టి ఎన్నికలను దూరం చేసే ప్రయత్నం చేస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే సర్వేలో మిస్ అయిన వారి జనాభాను నమోదు చేసుకొనే అవకాశం ఇవ్వాలని అన్నారు. కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో వచ్చిన బీసీ జనాభాకు, ప్రస్తుత సర్వేకు బీసీలలో 21 లక్షలు తేడా కనిపిస్తున్నదని చెప్పారు. అప్పుడు ఓసీల సంఖ్య చాలా తక్కువగా అని, ఈసారి వారి సంఖ్య బాగా పెరిగిందని, ఇందులో మతలబు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం ఓసీల జనాభా పెరిగి బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గుతుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ప్రస్తుతం ప్రకటించిన జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగలకు కూడా న్యాయం జరగాలన్నారు. వర్గీకరణపై కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు యథావిధిగా అమలు చేయాలని అన్నారు.

కాళేశ్వరంపై కక్ష

తెలంగాణకు నెత్తి మీద నీటి కుండలాంటిది పెద్దపల్లి జిల్లా అని కవిత పేర్కొన్నారు. చిన్న మరమ్మతులతో బాగయ్యే మేడిగడ్డ బరాజ్‌ను కావాలనే కక్ష పూరితంగా పక్కన పెట్టారని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో కేవలం 16 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఆ నీరు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ఈ ప్రాంతంలోని పరిశ్రమల అవసరాలకే సరిపోతాయని, మరి సాగు నీటి పరిస్థితేంటో సమాధానం చెప్పాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధుకర్, దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోలేటి దామోదర్, చిరుమిల్ల రాఖేశ్, మూల విజయారెడ్డి, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

పోరాటం ఆగదు

బీసీలకు రాజకీయ సాధికారత వచ్చేంత వరకు, రాజకీయాల్లో బీసీలకు దక్కాల్సిన వాటా దక్కేంత వరకు తమ పోరాటం ఆగదని, ఈ ఉద్యమంలో జాగృతి ముందుంటుందని కవిత స్పష్టం చేశారు. బీసీ ఉద్యమాల్లో పని చేస్తున్న అందరు పెద్దలను కలుస్తామని, వారితో సమాలోచనలు చేస్తామని చెప్పారు. అనేక హామీలు ఇచ్చి, మోసపూరిత మాటలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పగలు, ప్రతీకార పాలన చేస్తున్నదని కవిత విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రజా సేవను పక్కన పెట్టి పగ తీర్చుకునే విధంగా ప్రభుత్వాలను నడుపుతున్నారని ఆరోపించారు. ఈ రెండు పార్టీలు కలిసి 'మేం కొట్టినట్టు చేస్తాం.. మీరు ఏడ్చినట్టు చేయాలన్నట్టుగా' మొసలి కన్నీరు కారుస్తున్నాయని మండిపడ్డారు.

సోమవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కిశోర్‌గౌడ్ తదితరులు

సర్వేలో కులాల లెక్కలేవి?

- తప్పుల తడకగా కులగణననివేదిక
- బీసీలను ఏమార్చేందుకు కుట్ర
- తీర్మానం చేసి చేతులు దులుపుకునేందుకు యత్నం
- 'స్థానికం'లో 42% కోటా ఇవ్వాలి
- లేదంటే బీసీలమంతా ఉద్యమిస్తాం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 3(నమస్తేతెలంగాణ): 'ప్రభుత్వం ప్రకటించిన కులగణన సర్వే నివేదికలో కులాలవారీగా లెక్కలు ఏవి? లక్షలాది కుటుంబాలను విస్మరించిన ఈ సర్వేకు శాస్త్రీయత ఎక్కడిది? అసలు ఈ సర్వే నివేదిక ఒక తప్పుల తడక' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వీ శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగానే బీసీల సంఖ్యను తక్కువగా చూపారని విమర్శించారు. ముస్లింల సంఖ్యను 2011 జనాభా లెక్కల కంటే ఈసారి తక్కువగా చూపారని ఆక్షేపించారు. నివేదికలోని వివరాలను పరిశీలిస్తే ప్రభుత్వం బీసీలను మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ మేరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% కోటా అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ నుంచే బీసీ ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. 1,500 పేజీలున్న సర్వే నివేదికపై అసెంబ్లీలో చర్చించేందుకు సర్కారు ఒకరోజే సమావేశాలు నిర్వహించాలనుకోవడం విడ్డూరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది తర్వాత మేల్కొని సర్వే నిర్వహించి, ఇప్పుడు హడావుడిగా చర్చ చేపట్టడంలోని అంతర్యమేమిటని ప్రశ్నించారు. తూతూమంత్రంగా చర్చ పెట్టి కేంద్రానికి పంపి చేతులు దులుపుకొనేందుకు యత్నిస్తున్నదని విమర్శించారు. కోర్టు కేసులను సాకుగా చూపి బీసీ రిజర్వేషన్లను ఎగ్గొట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నదని దుయ్యబట్టారు. ప్రభుత్వం తిరిగి సర్వే నిర్వహించి శాస్త్రీయ పద్ధతిలో వివరాలు సేకరించాలన్నారు. చేతగాదని చెబితే బీఆర్ఎస్‌కు సర్వే నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, నాయకులు గట్టు హన్మంతు, యాదయ్య పాల్గొన్నారు.

బీసీల సంఖ్యను తగ్గించారు!

- అసమగ్రంగా కులగణన సర్వే
- కేసీఆర్ హయాంలో చేపట్టిన సర్వేలో 52 శాతం బీసీ జనాభా
- నేడు కుదించడం అన్యాయం
- ఆర్ కృష్ణయ్య ధ్వజం

హైదరాబాద్, ఫిబ్రవరి 3(నమస్తేతెలంగాణ): 'తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే అసమగ్రంగా ఉన్నది. హడావుడిగా సర్వేచేసి తప్పుల తడుకగా నివేదిక రూపొందించారు. బీసీల సంఖ్యను కావాలనే తగ్గించి చూపారు' అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. పూర్తిస్థాయిలో సర్వే చేయకుండానే నివేదికను విడుదల చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సోమవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 52% ఉన్నదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 46 శాతానికి తగ్గించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్లను దెబ్బతీసేందుకే ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపిందని దుయ్యబట్టారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి బలహీనవర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బీసీల అణచివేతకు రహస్య కుట్రలు

- మళ్లీ సర్వే నిర్వహించాలి
- బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 3(నమస్తేతెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలోని బలహీనవర్గాలను అణగదొక్కేందుకు ప్రభుత్వంలోని కొందరు పెద్దలు రహస్య కుట్రలకు తెరలేపారని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ ధ్వజమెత్తారు. తప్పుల తడకగా కులగణన సర్వే నిర్వహించి బీసీ జనాభా తగ్గినట్టుగా చూపుతున్నారని మండిపడ్డారు. నాడు ఓట్ల కోసం 42% బీసీ కోటా ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఎత్తేసేందుకు యత్నిస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. కేవలం 60 నుంచి 65% కుటుంబాల నుంచే వివరాలు సేకరించారని విమర్శించారు. హైదరాబాద్‌లో అయితే 25% మాత్రమే సర్వే చేసి మిగతా కుటుంబాలను విస్మరించారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో 52% ఉన్న బీసీ జనాభా ఏకంగా 7 శాతానికి తగ్గించి చూపడం దారుణమని పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్, నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నిర్వహించిన సర్వేల్లోనూ బీసీల జనాభా 57 శాతానికి పైగా ఉన్నట్టు తేలిందని తెలిపారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం బీసీ జనాభా గణనీయంగా తగ్గిందని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీల అభ్యున్నతిపై సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే తిరిగి మళ్లీ సర్వే నిర్వహించాలని కృష్ణమోహన్ డిమాండ్ చేశారు.

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవులు

కాంగ్రెస్ డీఎన్ఏలోనే బీసీ వ్యతిరేకత

- ఓట్ల కోసం నాడు బీసీల కాళ్లు పట్టుకున్నరు
- కులగణన పేరుతో రేవంత్ సర్కార్‌ది డ్రామా
- 5 నుంచి బీసీ కార్యాచరణను ప్రారంభిస్తాం
- బీసీ సంఘాల నేతలు చిరంజీవులు, జాజుల

ఖైరతాబాద్, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ డీఎన్ఏలోనే బీసీ వ్యతిరేకత ఉన్నదని, అది కులగణనతో నేడు స్పష్టమైందని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి టీ చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. సమగ్ర కులగణన పేరుతో రేవంత్‌రెడ్డి సర్కారు ఏడాదికాలంగా డ్రామా ఆడిందని విమర్శించారు. బీసీ కులగణన పేరుతో ఓసీల కులగణన చేపట్టిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీల జనాభాను తక్కువ చేసి అగ్రకులాలను ఎక్కువ చేసి చూపించేందుకే దీనిని ఉపయోగించుకున్నారని మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కులగణన వివరాల పేరుతో కాకమ్మ, పిట్ట, కట్టుకథలు చెప్పారని ధ్వజమెత్తారు. దీనిలో నూరుశాతం కుట్ర జరిగిందని విమర్శించారు. కులగణన సమగ్రంగా, సంపూర్ణంగా, శాస్త్రీయంగా జరగలేదని స్పష్టం చేశారు. బీసీలను సామాజికంగా, రాజకీయంగా, అణచివేసి అగ్రకులాల పాలనను మరో వందేండ్లు పెంచడానికి జరిగిన కుట్రలో భాగమే ఈ అశాస్త్రీమైన కులగణన అని పేర్కొన్నారు. బీసీలకు నిజంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేనేలేదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే బీసీ మేధావులతో కమిటీ వేసి కులగణన వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రకటన నేపథ్యంలో మంగళవారం బీసీలు పూలే, అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, సర్వే రిపోర్టులను చెత్తబుట్టలో వేయాలని పిలుపునిచ్చారు. 5న బీసీ మేధావులు, ఉద్యోగ, ప్రజాసంఘాలతో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు.

పొంగులేటి ఏమైనా ఎన్నికల అధికారా?

స్థానిక సంస్థలకు 15న నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎలా ప్రకటిస్తారని జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవులు ప్రశ్నించారు. ఆయన ఏమైనా చీఫ్ ఎలక్షన్ ఆఫీసరా? అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం బీసీల కాళ్లు పట్టుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. బీసీ సమాజాన్నే బొందపెట్టాలని చూస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి కాంగ్రెస్‌ను వదిలిపెట్టేది లేదని, ఆ పార్టీకి వ్యతిరేకంగా మహోద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు బాలగోని బాలరాజుగౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాడూరి శ్రీనివాస్, తాటికొండ విక్రమ్‌గౌడ్, బండి సాయన్న, ఏ వేణుకుమార్, దుర్గయ్యగౌడ్, రఘురాం నేత, పిడికిలి రాజు, జాజుల లింగంగౌడ్, మాదేశి రాజేందర్, లావణ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు కాంగ్రెస్ మోసం

కులగణన నివేదికలను చెత్తబుట్టలో వేస్తాం: జాజుల

తప్పుల తడుకగా రూపొందించిన కులగణన సర్వే నివేదికను మంగళవారం చెత్తబుట్టలో వేసి నిరసన తెలుపుతామని జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 నుంచి 2021 వరకు బీసీల జనాభా తగ్గిందని పేర్కొనడం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకునేందుకే అగ్రకులాల జనాభాను పెరిగినట్టుగా చూపుతున్నారని ఆరోపించారు. బలహీనవర్గాలను దగా చేసిన కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

వీ హబ్‌తో మహిళలకు సుస్థిర భవిష్యత్తు

- వీ హబ్‌ను సందర్శించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

వీ హబ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్, మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): మహిళలకు ఆర్థిక స్వేచ్ఛతోనే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, మహిళా సాధికారత సామాజిక అభివృద్ధికి ఎంతో కీలకమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి వీ హబ్‌ను సోమవారం గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంలో వీ హబ్ ముఖ్య భూమిక పోషిస్తున్నదని కొనియాడారు. మహిళలకు సుస్థిర భవిష్యత్తును అందించేందుకు వీ హబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని, ఆర్థిక ప్రగతిలో మహిళా పారిశ్రామికవేత్తలు భాగస్వామ్యులు కావాలని సూచించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. టైర్-2, టైర్-3 నగరాలను ప్రోత్సహించేలా వీ హబ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, దేశంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే వేదిక వీ హబ్ ఒకటేనని, రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకూ సేవలందించేందుకు వీ హబ్ సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో వీ హబ్ సీఈవో సీతా పల్లచొల్లా, మహిళా ఆంత్రప్రెన్యూర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు స్టార్టప్ సంస్థలు రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శించారు.

హైదరాబాద్ మల్కాజిగిరిలో జరిగిన బీఆర్‌టీయూ సమావేశంలో మాట్లాడుతున్న ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య

పని గంటల పెంపు ప్రతిపాదన లేదు

పార్లమెంటుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: ఉద్యోగుల పని గంటలను పెంచాలనే ప్రతిపాదనను పరిశీలించడం లేదని కేంద్ర ప్రభుత్వం సోమవారం పార్లమెంటుకు తెలిపింది. కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో, వారానికి గరిష్ఠ పని గంటలను 70 లేదా 90 గంటలకు పెంచాలనే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో లేదన్నారు. ఇది కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోని అంశమని చెప్పారు. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు తమ అధికార పరిధులలో కార్మిక చట్టాలను అమలు చేస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఈ చట్టాలను సెంట్రల్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ మెషినరీ తనిఖీ అధికారులు, రాష్ట్రాలు తమ కార్మిక శాఖ అధికారుల ద్వారా అమలు చేస్తాయని తెలిపారు. ఫ్యాక్టరీల చట్టం, 1948; దుకాణాలు, సంస్థల చట్టాలకు అనుగుణంగా పని గంటలు, ఓవర్‌టైమ్, పని పరిస్థితులు వంటివాటిని రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రిస్తాయని చెప్పారు. కార్పొరేట్ రంగంలోని సంస్థలు కూడా ఈ చట్టాల పరిధిలోకి వస్తాయని వివరించారు. ఉద్యోగులు వారానికి 70-90 గంటలు పని చేయాలని 'ఇన్ఫోసిస్' నారాయణ మూర్తి, ఎల్ అండ్ టీ హెచ్ఆర్ చీఫ్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం వంటివారు అభిప్రాయపడిన సంగతి తెలిసిందే.

నవీన్‌వి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

- జర్నలిజం పేరుతో అనేక అకృత్యాలు
- బీసీలకు చేసిన న్యాయమేంటో చెప్పు
- రెడ్డి సంఘం నాయకుల డిమాండ్

భూపాలపల్లిలో మీడియా సమావేశంలో రెడ్డి సంఘం నాయకులు

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 3: జర్నలిజం పేరుతో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ రెడ్డి బిడ్డలను అగౌరవపరిచిన చింతపండు నవీన్‌కుమార్ గత చరిత్ర ఏంటో తమకు తెలుసని రెడ్డి సంక్షేమ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు గోలి దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. జర్నలిజం పేరిట అనేక ఆకృత్యాలకు పాల్పడినట్టు విమర్శించారు. అధికారంలో ఉన్న పార్టీ నేతలకు వంతపాడుతూ కొంతమంది విసిరే ఎంగిలి మెతుకులకు ఆశపడతాడని ఆరోపించారు. అమాయకులైన బీసీలను ప్రలోభాలకు గురిచేస్తూ మోసపూరితమైన మాటలు చెప్తూ పబ్బం గడుపుకొనే నీచమైన సంస్కృతి ఆయనదని మండిపడ్డారు. సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు తుమ్మేటి రామ్ రెడ్డి, మోహన్ రెడ్డి, పాడి మహేందర్ రెడ్డి, పాడి బుచ్చిరెడ్డి, లింగాల రమణా రెడ్డి, బుద్ధిరెడ్డి మధుకర్ రెడ్డి, రఘునాథ రెడ్డి, పోలాల రమణారెడ్డి, రెడ్డి పరపతి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బిల్లా రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలకు రేవంతే కారణం!

- కాంగ్రెస్ పార్టీ హామీలు నెరవేర్చాలి
- ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ చేయాలి
- బీఆర్‌టీయూ నాయకుల డిమాండ్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు సీఎం రేవంత్‌రెడ్డే కారణమని బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ ఆటోడ్రైవర్ల ఉపాధిపై దెబ్బకొట్టి, కుటుంబాన్ని పోషించుకోలేని దుస్థితి కల్పించిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 80 మందికిపైగా ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైందని నిప్పులుచెరిగారు. సోమవారం మల్కాజిగిరి లో సమావేశమైన బీఆర్‌టీయూ నాయకులు హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించారు. ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు, ఏడాదికి రూ.12 వేలు పంపిణీ వాగ్దానాలను నెరవేర్చేవరకు ఉద్యమిస్తామని మారయ్య తెలిపారు. డీజిల్ ఆటోలను ఔటర్ రోడ్డు బయటకు పంపిస్తామని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వాటి స్థానంలోఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు మహేశ్ దేశ్‌పాక్, ఉపాధ్యక్షుడు రమేశ్, రాష్ట్ర కార్యదర్శి బాలనరసింహ, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హైమద్, నాయకులు ప్రదీప్, శ్రీనివాస్, గోపాల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.